సాక్షి
రాజన్న సిరిసిల్ల
ఆదివారం । 26 । జనవరి । 2025



రాజ్యాంగ స్ఫూర్తి.. గణకీర్తి

- సాగు, ఉపాధి, ఉద్యోగ రంగాల్లో రాణింపు
- ఆదర్శం.. పలువురు ఉమ్మడి జిల్లావాసులు
- రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 ఏళ్లు పూర్తి

అవకాశాలు, హక్కులతో అభివృద్ధికి బాటలు

మన రాజ్యాంగం దేశ ప్రజలందరికీ సమాన అవకాశాలు, హక్కులు, బలహీనులకు ఆపన్నహస్తం ఇచ్చింది. దాని నీడలో గ్రామాలు, నగరాల అభివృద్ధికి బాటలు పడ్డాయి. రాజ్యాంగ ఫలాలతో తమను తాము తీర్చిదిద్దుకుంటున్న ఎందరో దేశ ప్రగతి, సంక్షేమం, అభివృద్ధిలో భాగస్వాములవుతున్నారు. చదువుకున్న పలువురు యువత ఉద్యోగాలు వదిలి, సాగు బాట పట్టారు. వ్యవసాయంలో ఆధునిక టెక్నాలజీ ఉపయోగిస్తూ.. ఆదాయం పొందుతూ రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. ఉపాధి కోసం ఎదురుచూసిన కొందరు మహిళలు యజమానులుగా పలు వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. గ్రామీణ యువత దేశ రక్షణకు సైన్యంలో చేరుతున్నారు. దేశభక్తి పెంపొందేలా పలు ప్రాంతాల్లో నిత్య జనగణమన ఆలపిస్తున్నారు. జాతీయ జెండాల తయారీతో సిరిసిల్ల నేతన్నలు ఉపాధి పొందుతున్నారు. ఇక్కడి జెండాలు దేశవ్యాప్తంగా సరఫరా అవుతుండటం మనకు గర్వకారణం. రాజ్యాంగం అమల్లోకి వచ్చి, నేటితో 75 ఏళ్లు పూర్తవుతున్న, గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో స్ఫూర్తిగా నిలుస్తున్న పలువురిపై ప్రత్యేక కథనం.

దేశమంతటికీ సిరిసిల్ల జెండాలు

సిరిసిల్ల: వస్త్రోత్పత్తి ఖిల్లా.. సిరిసిల్ల. ఇక్కడ ఉత్పత్తి అయ్యే బట్టతో జాతీయ జెండాలు తయారవుతాయి. స్వాతంత్ర్య, గణతంత్ర, తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాల సందర్భంగా ఇక్కడి జెండాలకు ఎంతో ప్రాధాన్యం ఉంటుంది. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలకు సరఫరా అవుతూ ఇక్కడి నేతన్నల ఉపాధికి అండగా నిలుస్తున్నాయి. ఆగస్టు 15వ తేదీకి, జనవరి 26వ తేదీకి ముందుగానే లక్షల్లో జెండాల తయారీ, అమ్మకాలు జరిగిపోతాయి. సిరిసిల్లలో ఉత్పత్తి అయిన వస్త్రాన్ని ప్రాసెసింగ్ చేసి, మూడు రంగుల్లో ప్రింటింగ్ చేయిస్తారు. ఆ బట్టను జెండాల సైజును బట్టి, మెషిన్లపై మహిళలు కుడుతారు. ఒక్కో జెండాను రూ.50 నుంచి రూ.200 వరకు విక్రయిస్తున్నారు.

పల్లెల నుంచి సైన్యంలోకి..


అనిల్ విగ్రహం వద్ద సేవా మెడల్‌తో సతీమణి సౌజన్య

పెద్దపల్లిరూరల్/ఇల్లంతకుంట/మల్యాల/బోయినపల్లి: పల్లె యువత సైన్యంలో చేరేందుకు ముందుకు వస్తున్నారు. సరిహద్దుల్లో పహారా కాస్తూ దేశ రక్షణ కోసం ఎంతటి త్యాగానికైనా సిద్ధపడుతున్నారు. పెద్దపల్లి మండలంలోని మారెడుగొండ, బ్రాహ్మణపల్లి నుంచి దాదాపు 40 మంది యువకులు సైన్యంలో ఆర్మీ, సీఆర్‌పీఎఫ్, తదితర విభాగాల్లో పని చేస్తున్నారు. బ్రాహ్మణపల్లికి చెందిన మేకల విజయ్‌కుమార్ మాజీ సైనికుల సంఘం పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడిగా ఉన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట నుంచి ఏడుగురు యువకులు ఆర్మీ సైనికులుగా చైనా, పాకిస్తాన్ బార్డర్‌లలో ఎముకలు కొరికే చలిలో విధులు నిర్వహిస్తున్నారు. ఈ గ్రామానికి చెందిన జెట్టి పోచయ్య, ఎండీ.జైనుద్దీన్ మొదటగా ఆర్మీలో సేవలందించారు. మల్యాల, బోయినపల్లి మండలాల నుంచి కూడా పలువురు యువకులు సైన్యంలో సేవలందిస్తున్నారు. మల్యాపూర్‌కు చెందిన పబ్బాల అనిల్ 2023 మే 4న జమ్మూకశ్మీర్‌లోని నదీలో హెలికాప్టర్ పడిపోయిన ప్రమాదంలో మృతిచెందాడు. ఈ నెల 14న పుణేలో జరిగిన భారత సైనిక దినోత్సవంలో మరణానంతర సేవా మెడల్‌ను అనిల్ సతీమణి సౌజన్యకు అందజేశారు.

సాగులో డ్రోన్ స్ప్రేయర్..

- ఫార్మసీ చదివిన యువరైతు కొత్త తరహా వ్యవసాయం


డ్రోన్ స్ప్రేయర్‌తో పిచికారీ చేస్తున్న మహిపాల్‌రెడ్డి

కథలాపూర్(వేములవాడ): కథలాపూర్ మండలంలోని భూషణరావుపేటకు చెందిన గడ్డం మహిపాల్‌రెడ్డి వ్యవసాయంలో ఆధునిక టెక్నాలజీ వినియోగిస్తున్నాడు. హైదరాబాద్‌లో బీ.ఫార్మసీ చదివి, కొన్నేళ్లు ఫార్మా కంపెనీల్లో పని చేశాడు. తర్వాత స్వగ్రామానికి వచ్చి, వ్యవసాయం చేస్తున్నాడు. 4 నెలల క్రితం పంట పొలాలకు క్రిమిసంహారక మందులు పిచికారీ చేసే డ్రోన్ స్ప్రేయర్ కొనుగోలు చేశాడు. తన పొలానికే కాకుండా గ్రామంలోని ఇతర రైతుల పొలాలకు కూడా దీన్ని ఉపయోగిస్తున్నాడు. ఎకరా పంటకు రూ.500 తీసుకొని డ్రోన్ స్ప్రేయర్‌తో క్రిమిసంహారక మందులు పిచికారీ చేస్తున్నట్లు తెలిపాడు. కూలీలను పిలవాల్సిన అవసరం లేకుండానే పని పూర్తవుతోందని రైతులు చెబుతున్నారు.

కలెక్టరేట్‌లో క్యాంటీన్

- ఆదర్శంగా నిలుస్తున్న మల్కాపూర్‌వాసి రాజమణి

కరీంనగర్ అర్బన్: కరీంనగర్‌లోని మల్కాపూర్‌కు చెందిన పల్లె రాజమణి మహిళా లోకానికే ఆదర్శంగా నిలుస్తోంది. కలెక్టరేట్‌లో క్యాంటీన్‌ను నిర్వహిస్తూ పలువురు మహిళలకు ఉపాధి కల్పిస్తోంది. ఆమె వంటలకు ఫిదా అయిన కలెక్టర్ పమేలా సత్పతి తరచూ క్యాంటీన్‌ను సందర్శిస్తూ రుచిచూస్తున్నారు. క్యాంటీన్‌కు ఆదరణ పెరగడంతో సందడిగా కనిపిస్తోంది. రాజమణి శ్రీసాయి మహిళా సంఘంలో సభ్యురాలు. 4 నెలల క్రితం వరకు మల్కాపూర్‌లో కర్రీ పాయింట్ నిర్వహించేది. ప్రస్తుతం ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా కలెక్టరేట్ క్యాంటీన్‌ను నడిపిస్తోంది. వివిధ రకాల టిఫిన్లు, భోజనం, పచ్చళ్లు, పిండి వంటలు విక్రయిస్తోంది. 4 పాడి గేదెలను కొనుగోలు చేసి, వాటి పాలతోనే క్యాంటీన్‌లో టీ, పాలు, పెరుగు అమ్ముతోంది. క్యాంటీన్ పల్లె వాతావరణాన్ని మరిపించే చిత్రాలతో ఆకట్టుకుంటోంది. ఆరుబయట చెట్ల నీడన టీ తాగుతూ సేదతీరేలా టేబుళ్లు ఏర్పాటు చేశారు. క్యాంటీన్ నిర్వహణలో కలెక్టర్ మేడమ్ ఎంతగానో ప్రోత్సహిస్తున్నారని రాజమణి చెబుతోంది. మహిళా శక్తి క్యాంటీన్‌కు ప్రభుత్వం మరింత ప్రచారం కల్పించాలని కోరుతోంది.


కలెక్టరేట్‌లోని క్యాంటీన్


రాజమణి

1950నాటి నాణెం.. అంబేడ్కర్ స్టాంపులు


సాయిరాం సేకరించిన నాణేలు, స్టాంపులు


సాయిరాం

సిరిసిల్లటౌన్: సిరిసిల్లకు చెందిన కొత్వాల సాయిరాం చిన్నప్పటి నుంచే దేశ స్వాతంత్ర్యోద్యమ పోరాట కథలు చదివాడు. వివిధ పత్రికల్లో వచ్చిన కథనాలకు సంబంధించిన క్లిప్పింగులు సేకరించడం అలవాటుగా మార్చుకున్నాడు. ఏటా జనవరి 26, ఆగస్టు 15, అక్టోబర్ 2వ తేదీల్లో వాటిని ప్రదర్శిస్తున్నాడు. ఈ ఏడాది రిపబ్లిక్ డే సందర్భంగా తాను సేకరించిన నాణేలు, పోస్టల్ స్టాంపులను ప్రదర్శించాడు. 1950లో భారత రాజ్యాంగం అమలైన సందర్భంగా ముద్రించిన రూపాయి నాణెం, వివిధ దశల్లో రాజ్యాంగ ప్రదాత డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ ఫొటోతో ముద్రించిన స్టాంపులను సేకరించాడు. వాటిని చూసిన పలువురు సాయిరాంను అభినందిస్తున్నారు.

జమ్మికుంటలో నిత్య జనగణమన

- కార్యక్రమ రూపకర్త అప్పటి సీఐ ప్రశాంత్‌రెడ్డి
- ఆదర్శంగా పలు రాష్ట్రాల్లో నిర్వహణ


ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి

జమ్మికుంట(హుజూరాబాద్): జమ్మికుంట పట్టణంలో 2017 ఆగస్టు 15న ప్రారంభమైన నిత్య జనగణమన కార్యక్రమం ఎనిమిదేళ్లుగా కొనసాగుతోంది. నిత్యం ఉదయం 7 గంటల 52 నిమిషాలకు ప్రధాన కూడళ్లతోపాటు గాంధీ చౌక్ వద్ద ప్రజలు జాతీయ గీతం పాడుతున్నారు. ఉరుకుల పరుగుల జీవనంలో ప్రజల్లో దేశభక్తి పెంపొందించే లక్ష్యంతో అప్పటి సీఐ, ప్రస్తుత ఏసీపీ సైబర్ క్రైం బ్యూరో హైదరాబాద్ పింగిళి ప్రశాంత్‌రెడ్డి దేశంలోనే తొలిసారి నిత్య జనగణమనకు ఇక్కడ రూపకల్పన చేశారు. ఈ కార్యక్రమాన్ని ఆదర్శంగా తీసుకొని, దేశంలోని కర్ణాటక, రాజస్థాన్, మహారాష్ట్ర, హరియాణా, ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ట్రాలు, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో అమలు చేస్తున్నారు. నిత్య జనగణమన ఒక పండుగ రూపం దాల్చాలని బలంగా కోరుకున్నాను. నా కల నెరవేరినందుకు సంతోషంగా ఉందని ఏసీపీ తెలిపారు. జమ్మికుంట మున్సిపల్ అధికారులు, ప్రభుత్వం చొరవ తీసుకొని, నిత్యజనగణమన కార్యక్రమానికి కావాల్సిన వసతులు కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.


జాతీయ గీతం పాడుతున్న పోలీసులు, ప్రజలు

న్యూస్‌రీల్

జాతరకు రండి


ఆహ్వానం అందించిన నాగారం గ్రామస్తులు

కోనరావుపేట(వేములవాడ): మండలంలోని నాగారంలో ఈనెల 29న నిర్వహించే మాఘ అమావాస్య జాతర మహోత్సవానికి రావాలంటూ కోదండ రామస్వామి ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను ఆహ్వానించారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్ అప్పాల నాగభూషణం, కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు బొమ్మెన భాస్కర్‌రావు, ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి దుంపేట నాగరాజు, కోశాధికారి సైండ్ల నాగరాజు, కీసరి శ్రీనివాస్, సూర ప్రశాంత్ పాల్గొన్నారు.

ముగ్గులు సంస్కృతికి ప్రతిబింబాలు


కోర్టు ఆవరణలో ముగ్గులు పరిశీలిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి జ్యోతిర్మయి

వేములవాడ: ముగ్గుల పోటీలు సంస్కృతి సంప్రదాయాలకు ప్రతిబింబాలుగా నిలుస్తాయని జూనియర్ సివిల్ జడ్జి జ్యోతిర్మయి పేర్కొన్నారు. కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన ముగ్గుల పోటీల్లోని విజేతలను ఎంపిక చేశారు. ఏజీపీ ప్రశాంత్‌కుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గుడిసె సదానందం, క్రీడల కార్యదర్శి నాగుల సంపత్, అడ్వకేట్లు పొత్తూరి అనిల్‌కుమార్, పంపరి శంకర్, ప్రభాకర్, అభిలాష్, అనిల్ పాల్గొన్నారు.

పథకాలను పకడ్బందీగా అమలు చేయాలి


బొప్పాపూర్‌లో రికార్డులు పరిశీలిస్తున్న కేంద్ర బృందం సభ్యులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): కేంద్రం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఆరోగ్య పథకాలను పకడ్బందీగా అమలు చేయాలని జనాభా పరిశోధన కేంద్ర(నేషనల్ హెల్త్ మిషన్ పాపులేషన్ రీసెర్చ్ సెంటర్) బృందం సభ్యులు డాక్టర్ ఫ్రాన్సిస్ జేవియర్, డాక్టర్ థాంగ్ పేర్కొన్నారు. మండలంలోని రాచర్లబొప్పాపూర్‌లోని ఆరోగ్య ఉపకేంద్రాన్ని, మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను శనివారం తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. రోగికి సంబంధించిన పూర్తి వివరాలు రికార్డుల రూపంలో నమోదు చేయాలన్నారు. డీపీవో రాజేందర్, మండల వైద్యాధికారి సారియా అంజుమ్, ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రదీప్‌కుమార్, వైద్యులు బాబు, రఘు, ఓంకార్, డీడీఎం కార్తీక్, పీహెచ్ రజనీ, హెల్త్ సూపర్‌వైజర్లు పద్మ, పద్మజ, ఇందిర పాల్గొన్నారు.

గణతంత్ర వేడుకలకు సిద్ధం


పోలీస్ పరేడ్‌గ్రౌండ్‌లో ఏర్పాట్లు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్

సిరిసిల్ల: గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు పకడ్బందీగా చేశామని అదనపు కలెక్టర్ ఎన్.ఖీమ్యానాయక్ తెలిపారు. పోలీస్ పరేడ్‌గ్రౌండ్‌లో ఆదివారం నిర్వహించే వేడుకల ఏర్పాట్లను శనివారం పరిశీలించారు. వేదికతోపాటు ప్రొటోకాల్ ప్రకారం సీటింగ్ ఏర్పాట్లు, సౌండ్‌సిస్టం, స్వాతంత్ర్య సమరయోధులకు అధికారులకు, సిబ్బందికి, ప్రజలకు అవసరమైన కుర్చీలు, తాగునీటి సౌకర్యం కల్పించినట్లు పేర్కొన్నారు. ఉదయం 9 గంటలకు కలెక్టర్ గౌరవ వందనం స్వీకరించి జాతీయపతాకాన్ని ఆవిష్కరిస్తారని, 9.10 గంటలకు కలెక్టర్ సందేశం, 9.20 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు, 9.50 గంటలకు విధులలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులు, సిబ్బందికి ప్రశంసాపత్రాలు పంపిణీ ఉంటుందని వివరించారు. సిరిసిల్ల ఇన్‌చార్జి ఆర్డీవో రాధాబాయి, మున్సిపల్ కమిషనర్ లావణ్య, డీపీఆర్వో శ్రీధర్ సిరిసిల్ల తహసీల్దార్ ఉమారాణి తదితరులు పాల్గొన్నారు.



పోలీస్ కవాతు

జిల్లా పోలీస్ కార్యాలయ ప్రాంగణంలో గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. పోలీస్ సిబ్బంది కవాతు నిర్వహణకు ప్రాక్టీస్ సైతం పూర్తి చేశారు. సివిల్, ఏఆర్ కానిస్టేబుళ్లు, మహిళా కానిస్టేబుళ్లు శనివారం నిర్వహించిన కవాతు దృశ్యాలు ఆకట్టుకున్నాయి. – సాక్షి ఫొటోగ్రాఫర్, రాజన్నసిరిసిల్ల

ఆరోగ్య కేంద్రాలు తనిఖీ


బద్దెనపల్లి ఉపకేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని పలు ఆరోగ్య ఉపకేంద్రాలను జిల్లా వైద్యాధికారి ఎస్.రజిత శనివారం తనిఖీ చేశారు. బద్దెనపల్లి, లక్ష్మీపూర్, గోపాలరావుపల్లిలోని ఆరోగ్య ఉపకేంద్రాలను పరిశీలించారు. ఆరోగ్య కేంద్రాల పరిధిలో అందుతున్న సేవలు, మాతాశిశు సంరక్షణ, రక్తపోటు, మధుమేహ వ్యాధులపై అందుతున్న సేవలను పరిశీలించారు. చీర్లవంచ సూపర్‌వైజర్ రాజు, సీహెచ్‌వోలు బాలచంద్రం, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఓటుహక్కు అందరి బాధ్యత


ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, అధికారులు


జిల్లా పోలీస్ ఆఫీస్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్, పోలీసుల అధికారులు

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా
- ప్రతిజ్ఞ చేసిన ఉద్యోగులు, సిబ్బంది

సిరిసిల్ల: ఓటుహక్కు వినియోగించుకోవడం అందరి బాధ్యత అని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో 'నథింగ్ లైక్ ఓటింగ్, ఐ ఓట్ ఫర్ ష్యూర్' అనే థీమ్‌తో 15వ జాతీయ ఓటర్ దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్ నమోదు పెంపు, ఎథికల్ ఓటింగ్‌పై అవగాహన కల్పించేందుకు ఏటా జనవరి 25న జాతీయ ఓటర్ దినోత్సవం నిర్వహిస్తామన్నారు. కలెక్టరేట్ అధికారులు, ఉద్యోగులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. అదనపు కలెక్టర్ ఎన్. ఖీమ్యానాయక్, ఎస్‌డీసీ రాధాబాయి, జెడ్పీ సీఈవో వినోద్, డీపీఆర్‌వో శ్రీధర్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. సిరిసిల్లలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు.

విద్యార్థులకు బహుమతులు

విద్యాసంస్థల్లో నిర్వహించిన పోటీల్లోని విజేతలకు బహుమతులు అందించారు. వ్యాసరచన పోటీల్లో చైతన్య, నిఖిత, హారిక, రోహిత్, సాయికృష్ణ, రాంచరణ్, ప్రేమ్‌కుమార్‌లకు బహుమతులు అందించి అభినందించారు. ఎక్కువ సార్లు ఓటు హక్కు వినియోగించుకున్న సీనియర్ సిటిజన్స్ ఎలగందుల బుచ్చయ్య, భారతి, ట్రాన్స్‌జెండర్ కౌసల్యను సన్మానించారు. కొత్తగా ఓటర్లుగా నమోదైన సుద్దాల హర్షవర్ధన్, సుంకనపల్లి స్వాతి, జక్కని ధనుష్, దూడం అఖిల, తోట ప్రసన్నాంభిలకు ఓటరు గుర్తింపుకార్డులు అందించారు.


కలెక్టరేట్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

ఓటు వజ్రాయుధం

ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు వజ్రాయుధమని, ఓటుహక్కు వినియోగించుకోవడం అందరి బాధ్యత అని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. సిరిసిల్ల పోలీస్ ఆఫీస్‌లో జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ దేశంలో 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటర్లుగా నమోదు చేసుకోవాలని, ప్రతి ఎన్నికలో ఓటుహక్కును విధిగా వినియోగించుకోవాలని సూచించారు. ఓటుహక్కును వినియోగించుకోవడం ద్వారా రాజ్యాంగ స్ఫూర్తిని భావితరాలకు తెలియజేయవచ్చన్నారు. ఈ సందర్భంగా ఓటరు ప్రతిజ్ఞ చేశారు. అదనపు ఎస్పీ చంద్రయ్య, డీఎస్పీ మురళీకృష్ణ, ఆర్‌ఐలు మధుకర్, రమేశ్, సీఐ మధుకర్, ఎస్సైలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


నాగభూషణం(ఫైల్)

ఇల్లంతకుంట(మానకొండూర్): నాలుగు రోజుల క్రితం రెండు బైకులు ఢీకొన్న ఘటనలో గాయపడి హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న వ్యక్తి శనివారం మరణించాడు. గ్రామస్తులు తెలిపిన వివరాలు. ఇల్లంతకుంట మండలం వెల్జిపురం గ్రామానికి చెందిన అట్ల నాగభూషణం మండల కేంద్రం నుంచి గ్రామానికి వస్తుండగా.. గూడ సురేశ్ దంపతులు బైక్‌పై రహీంఖాన్‌పేట వద్ద ఎదురెదురుగా వస్తుండగా ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో అట్ల నాగభూషణం తీవ్రంగా గాయపడ్డాడు. హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. వల్లంపట్లకు చెందిన సురేశ్ దంపతులు సిరిసిల్ల ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. నాగభూషణం హెల్మెట్ ధరించి ఉంటే బతికేవాడని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు.

సైబర్ మోసం.. రూ.35వేలు మాయం

ముస్తాబాద్(సిరిసిల్ల): సైబర్ నేరగాళ్లు పంపిన లింక్‌ను ఓపెన్ చేసిన వ్యక్తి బ్యాంక్ ఖాతా నుంచి రూ.35వేలు మాయమయ్యాయి. ఈమేరకు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ముస్తాబాద్ మండలం కొండాపూర్‌కు చెందిన దేవరాజురెడ్డి తనకు వాట్సాప్‌లో వచ్చిన ఏపీకే అనే మెస్సేజ్‌ను ఓపెన్ చేశాడు. వెంటనే తన బ్యాంక్ ఖాతాలో ఉన్న రూ.35వేలు ట్రాన్స్‌ఫర్ అయ్యాయి. అంతేకాదు అదే మెస్సేజ్ లింక్ ఇతర వాట్సాప్ గ్రూప్‌లలోనూ ఫార్వర్డ్ అయ్యింది. ఈమేరకు పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశాడు. ఏపీకే పేరుతో ఉన్న మెస్సేజ్‌లు ఓపెన్ చేయొద్దని ఎస్సై గణేశ్ సూచించారు.

గంజాయి పట్టివేత

గంభీరావుపేట(సిరిసిల్ల): మండలంలోని నాగంపేట శివారులో బస్సులో ప్రయాణిస్తున్న వ్యక్తి నుంచి గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. ఆర్టీసీ బస్సులో ఒకరు అనుమానాస్పదంగా కనిపించడంతో ఆపి తనిఖీ చేయగా 110 గ్రాముల గంజాయి దొరికినట్లు తెలిపారు. కరీంనగర్ జిల్లా గంగాధర మండలం ముప్పిడిపల్లికి చెందిన కల్లపల్లి శ్రీనివాస్ నెల రోజుల క్రితం మహారాష్ట్రలో గంజాయి కొనుగోలు చేశాడని చెప్పారు. అతను కొంచెం వినియోగించి మిగిలిన గంజాయిని అధిక ధరకు విక్రయించేందుకు వస్తుండగా పట్టుకుని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఎవరైనా గంజాయి సేవించినా, అమ్మినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

మల్లారం మాజీ సర్పంచ్ రిమాండ్

వేములవాడరూరల్: మల్లారం మాజీ సర్పంచ్ తిరుపతిని శనివారం రిమాండ్ చేసినట్లు వేములవాడరూరల్ ఎస్సై మారుతి తెలిపారు. గ్రామంలో అక్రమంగా చెట్లను నరికివేసి అమ్ముకున్నాడని ఇటీవల గ్రామస్తుల ఫిర్యాదుతో రెవెన్యూ, ఫారెస్టు అధికారులు విచారణ జరిపారు. విచారణ అనంతరం తహసీల్దార్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

అక్రిడిటేషన్ కమిటీ సభ్యుడి తొలగింపు

సిరిసిల్ల: తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ సిఫార్సు చేసిన జిల్లా అక్రిడిటేషన్ కమిటీ (2022–2024) సభ్యుడు యూసఫ్ అలియాస్ యూసూబ్‌ను అక్రిడిటేషన్ కమిటీ సభ్యుడిగా తొలగిస్తూ సమాచారశాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. యూసుఫ్‌పై పలు ఆరోపణలు, ఫిర్యాదులు, కేసులు నమోదయ్యాయి. పోలీసులు విచారణ చేపట్టి పూర్తి వివరాలు సమాచారశాఖకు అందించడంతో జిల్లా అక్రిడిటేషన్ కమిటీ నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

శంకరన్న యాదిలో..

- మానేరు ప్రాంతంలో ఒకప్పటి సంచలనం
- సిర్నాపల్లి ఆర్గనైజర్‌గా గుర్తింపు
- మూడు దశాబ్దాల క్రితం ఎన్‌కౌంటర్‌లో మృతి

'ఎర్రపూలతూటలో ఎర్ర ఎర్ర చామంతివో..
ఎర్రజెండా నీడలో ఒరిగిన పూబంతివో..
ఎర్రమల్లెల దండలేత్తుమో ఓ అమరవీర..
ఎదల నిన్ను దాచుకుందుమో ఓ శంకరన్న..'

ఇలాంటి పాటలు మూడు దశాబ్దాల క్రితం మానేరు, సిర్నాపల్లి ఏరియాల్లో మారుమోగాయి. అప్పటి పీపుల్స్‌వార్ సిర్నాపల్లి దళ సభ్యుడిగా ప్రస్థానం మొదలుపెట్టిన ఎల్లారెడ్డిపేటకు చెందిన దొంత మార్కండేయ అలియాస్ శంకరన్న క్రమంగా ఉత్తర తెలంగాణ జోనల్ కమిటీ సభ్యుడి వరకు ఎదిగారు. 1993, జనవరి 26న నిజామాబాద్ పట్టణంలోని వినాయకనగర్‌లో పోలీస్ ఎన్‌కౌంటర్‌లో ప్రాణాలు కోల్పోయారు. ఆనాటి సంఘటనను జీర్ణించుకోలేని సిర్నాపల్లి, మానేరు అటవీప్రాంతంలోని గిరిజనులు శోకసముద్రంలో మునిగిపోయారు. శంకర్ ఎన్‌కౌంటర్ జరిగి 32 ఏళ్లు అవుతున్న సందర్భంగా ఆనాటి సంఘటనలపై 'సాక్షి' కథనం.

– ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల)

ఎల్లారెడ్డిపేటలో పుట్టి


శంకర్(ఫైల్)

ప్రస్తుత రాజన్నసిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేటకు చెందిన దొంత హన్మంతు–సిద్దవ్వ దంపతుల చిన్నకుమారుడు మార్కండేయ అలియాస్ శంకర్. స్థానికంగా ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి వరకు చదువుకున్నాడు. సిరిసిల్ల ప్రాంతంలో రాడికల్ స్టూడెంట్ యూనియన్(ఆర్‌ఎస్‌యూ) ఉద్యమాలు ఉవ్వెత్తున సాగుతుండేవి. అప్పటి ఈ ప్రాంత ఆర్గనైజర్‌లు నర్సింహారెడ్డి, ప్రకాశ్‌ల ఉద్యమ స్ఫూర్తితో శంకర్ పీపుల్స్‌వార్ పార్టీలో 1982లో చేరారు. ఏడాది తర్వాత 1983లో నిజామాబాద్‌లో పోలీసులు అరెస్ట్ చేశారు. కొద్దికాలం జైలు జీవితం గడిపి, బయటకు వచ్చిన తర్వాత మళ్లీ అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు.

సంచలనాలకు కేరాఫ్

- అప్పటి పీపుల్స్‌వార్ కేంద్ర కమిటీ కార్యదర్శి కొండపల్లి సీతారామయ్య స్థానంలో ముప్పాళ్ల లక్ష్మణ్‌రావు అలియాస్ గణపతిని నియమించడంలో శంకర్ ముఖ్య భూమిక పోషించారు.
- పార్టీలో పనిచేస్తున్న సమయంలోనే ఉద్యమ సహచరిణి నల్లవెల్లికి చెందిన స్వరూప అలియాస్ జ్యోతిని వివాహం చేసుకున్నారు.
- సిర్నాపల్లి దళనాయకురాలిగా పనిచేస్తున్న జ్యోతి 1992లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతిచెందింది.
- ఈ విషయం తెలుసుకున్న ఖమ్మం జిల్లాకు చెందిన సరళ అనే యువతి శంకర్‌ను కలిసి, ఉద్యమంలో చేరేందుకు సిర్నాపల్లి ప్రాంతానికి చేరుకుంది. అనేక అవాంతరాల తర్వాత శంకర్‌ను కలవగా.. ఆ సమయంలోనే పోలీస్ కోవర్టులు పెరగడంతో శంకర్‌తోపాటు దళసభ్యులు సరళను పోలీస్ కోవర్టుగా భావించి విచారణ మొదలుపెట్టారు. ఎంత విచారించినా తాను పార్టీలో చేరేందుకే వచ్చానని తెలపడంతో మరిన్ని వివరాలు రాబట్టేందుకు తుపాకీతో బెదిరించే ప్రయత్నంలో జరిగిన సంఘటనలో సరళ ప్రాణాలు కోల్పోయింది. ఈ సంఘటనను ఆధారంగా తీసుకొని ఇటీవల 'విరాట పర్వం' సినిమా సైతం వచ్చింది.
- 1993, జనవరి 26న నిజామాబాద్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో శంకర్ అలియాస్ మార్కండేయ ప్రాణాలు కోల్పోయారు.
- శంకర్‌తో పనిచేసిన చాలా మంది ఉద్యమకారులు ఆనాటి, నేటి పరిస్థితులను బేరీజు వేసుకుంటున్నారు. పల్లెల్లో వారు జరిపిన ఉద్యమ తీరును, ప్రజల నుంచి వచ్చిన స్పందనను ఇప్పటికీ చర్చించుకుంటున్నారు.


ఉద్యమ సహచరిణితో శంకర్(ఫైల్)

ఇల్లు..రేషన్!

- రేషన్‌కార్డు, ఇందిరమ్మ ఇళ్ల కోసం ఎక్కువ దరఖాస్తులు
- గ్రామ, వార్డుసభల్లో 40,360 దరఖాస్తులు
- నాలుగు రోజుల్లో 322 సభలు
- నేటి నుంచి అమలుకానున్న పథకాలు
- మండలానికో గ్రామంలో అమలు

దరఖాస్తులు ఇలా..

రేషన్‌కార్డులు	16,505
ఇందిరమ్మ ఇళ్లు	14,542
ఇందిరమ్మ ఆత్మీయ భరోసా	9,172
రైతుభరోసా	141
మొత్తం దరఖాస్తులు	40,360


గంభీరావుపేటలో దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు (ఫైల్)

సిరిసిల్ల: గూడు.. కూడు కోసం జిల్లా ప్రజలు తమ గోడు విన్నవించుకున్నారు. జిల్లా వ్యాప్తంగా అత్యధిక దరఖాస్తులు రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల కోసమే వచ్చాయి. జిల్లాలో జనవరి 21 నుంచి 24 వరకు నిర్వహించిన గ్రామసభలు నిరసనలు, నిలదీతల మధ్య కొనసాగాయి. సిరిసిల్ల, వేములవాడ పట్టణాలతోపాటు 255 గ్రామాల్లో ప్రజాపాలన సభలు నిర్వహించారు. సిరిసిల్లలో 39 వార్డులు, వేములవాడలో 28 వార్డులతోపాటు 255 గ్రామాల్లోనూ గ్రామసభలు నిర్వహించారు. నాలుగు రోజుల్లో 322 గ్రామ సభలు నిర్వహించగా.. 40,360 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో అత్యధికంగా రేషన్‌కార్డుల కోసం 16,505, ఇందిరమ్మ ఇంటి కోసం 14,542 దరఖాస్తులు వచ్చాయి.

జిల్లాలో పర్యటించిన మంత్రులు

రుద్రంగి మండల కేంద్రంలో నిర్వహించిన గ్రామసభలో రాష్ట్ర మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ హాజరయ్యారు. జిల్లాలోని పలు గ్రామాల్లో కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ పరిశీలించారు. జిల్లా ఎస్పీ అఖిల్‌మహాజన్ గ్రామసభల వద్ద బందోబస్తును పరిశీలించారు. అనేక గ్రామాల్లో రైతుబంధు రాలేదని, గతంలో ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులు ఏమయ్యాయని అధికారులపై ప్రశ్నల వర్షం కురిపించారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ గ్రామసభల్లో పాల్గొని ప్రభుత్వ లక్ష్యాలను వివరించారు.

కొత్త పెన్షన్ల ఊసేది

గ్రామ, వార్డుసభల్లో కొత్త పెన్షన్ ఊసెత్తకుండా సాగిపోయాయి. చాలా మంది వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, చేనేత, గీతకార్మికులు ప్రభుత్వం అందించే సామాజిక పెన్షన్ల దరఖాస్తులతో రాగా.. అధికారులు వాటిని స్వీకరించలేదు. అనేక మంది పేదలు పెన్షన్ల కోసం గ్రామసభలకు వచ్చి నిరాశతో వెనుదిరిగారు. మరోవైపు సాగులో ఉన్న భూములకే రైతుభరోసా ఇస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో సాగులో లేని భూముల వివరాలను అధికారులు గ్రామసభల్లో చదివి వినిపించారు. ఇప్పటికే వ్యవసాయశాఖ అధికారులు వ్యవసాయేతర భూములను సర్వే చేసి నివేదిక సిద్ధం చేశారు. ఆ నివేదిక ఆధారంగా నాలా చెల్లించిన భూములను, వ్యవసాయ యోగ్యం కాని భూముల వివరాలను గ్రామసభల్లో వెల్లడించారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకంలో భాగంగా వ్యవసాయ భూములు లేని పేదలకు ఏటా రూ.12వేలు అందించాలని భావిస్తున్నారు. ఉపాధిహామీ పథకంలో పనిచేసిన జాబ్‌కార్డు ఉన్న పేదలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని అందించాలని నిర్ణయించారు. మొత్తంగా రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా ప్రజాపాలన గ్రామ, వార్డు సభలు ముగిశాయి.

నేడు ఈ గ్రామాల్లోనే ప్రారంభం

బోయినపల్లి మండలంలో అనంతపల్లి, చందుర్తిలో కొత్తపేట, ఇల్లంతకుంటలో సిరికొండ, గంభీరావుపేటలో దమ్మన్నపేట, కోనరావుపేటలో గొల్లపల్లి, ముస్తాబాద్‌లో కొండాపూర్, రుద్రంగిలో గైదిగుట్టతండా, తంగళ్లపల్లిలో రాళ్లపేట, వీర్నపల్లిలో లాల్‌సింగ్‌తండా, వేములవాడలో శాభాష్‌పల్లి, వేములవాడరూరల్‌లో వెంకాయపల్లి, ఎల్లారెడ్డిపేటలో గుండారం, సిరిసిల్ల పట్టణంలో పెద్దూరు(8వ వార్డు)లలో ఆదివారం నాలుగు పథకాలను ప్రారంభించనున్నారు. ఈ మేరకు ఆయా గ్రామాల్లో ఏర్పాట్లు చేశారు.

గోదాముల నిర్మాణంతో రైతులకు మేలు

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్


గోదాం ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడరూరల్: గోదాముల నిర్మాణంతో రైతులకు మేలు జరుగుతుందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. వేములవాడరూరల్ మండలం వట్టెంల గ్రామంలో వేములవాడ పీఏసీఎస్ ఆధ్వర్యంలో రూ.24లక్షలతో నిర్మించిన 300 మెట్రిక్ టన్నుల ఎరువుల గోదాంను శనివారం ప్రారంభించి మాట్లాడారు. దివంగత సీఎం వైఎస్సార్ హయాంలోనే సహకార సంఘాలు బలోపేతమయ్యాయన్నారు. నాబార్డ్ నిధులే కాకుండా సహకార బ్యాంకు నిధులతో పలు గోదాములు నిర్మిస్తున్నట్లు తెలిపారు. పదేళ్లుగా ప్రజలు ఎదురుచూస్తున్న 4 సంక్షేమ కార్యక్రమాలను ఆదివారం నుంచి అమలు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం శాత్రాజుపల్లి 1, 2 వార్డుల్లో రూ.36 లక్షలతో శ్మశానవాటిక, రూ.15 లక్షలతో బస్టాండ్ ఆవరణ సుందరీకరణ, రూ.6లక్షలతో డ్రెయినేజీ పనులకు భూమిపూజ చేశారు. శాత్రాజుపల్లికి రూ.1.50కోట్లతో సెమీ అర్బన్ హాస్పిటల్‌ను మంజూరు చేసినట్లు ఆది శ్రీనివాస్ తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, వైస్‌చైర్మన్ బింగి మహేశ్, కౌన్సిలర్లు సంగ హన్మవ్వ, రెండుమిద్దెల జయ, ఏఎంసీ చైర్మన్ రొండి రాజు, వైస్ చైర్మన్ కనికరపు రాకేశ్, ప్యాక్స్ చైర్మన్ ఏనుగు తిరుపతిరెడ్డి, పార్టీ రూరల్ అధ్యక్షుడు వకుళాభరణం శ్రీనివాస్, మాజీ ఎంపీపీ రంగు వెంకటేశ్, మున్సిపల్ కమిషనర్ అన్వేశ్, ఏడీఏ రామారావు, సంగ స్వామి, ఏఎంసీ డైరెక్టర్ పాలకుర్తి పర్శరాములు, పొద్దుపొడుపు లింగారెడ్డి, తోట రాజు, ఏవో వినీత పాల్గొన్నారు.

సకలమ్మ మృతితో పదిరలో విషాదం

- హైదరాబాద్‌లో అంత్యక్రియలు


సకలమ్మ(ఫైల్)

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మాజీ సీఎం కేసీఆర్ సోదరి చీటీ సకలమ్మ(82) మృతితో ఆమె స్వగ్రామం రాజన్నసిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం పదిరలో విషాదం అలుముకుంది. సకలమ్మతో ఉన్న అనుబంధాన్ని గ్రామస్తులు గుర్తుచేసుకున్నారు. మాజీ సీఎం కేసీఆర్ తన చిన్నతనంలో పదిరలో సోదరితో కలిసే ఉండేవారని స్థానికులు చర్చించుకున్నారు. హైదరాబాద్‌లో ఉంటున్న సకలమ్మ అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం రాత్రి మృతిచెందింది. ఆమెకు చీటీ నర్సింగరావు, చీటీ ఉమేశ్‌రావు, చీటీ రవీందర్‌రావు కుమారులు. శనివారం హైదరాబాద్‌లోనే అంత్యక్రియలు నిర్వహించారు. మండలం నుంచి బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, మాజీ జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు, సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ వరుస కృష్ణహరి, నాయకులు అందే సుభాష్, కొండ రమేశ్‌గౌడ్, గుల్లపల్లి నర్సింహారెడ్డి, కుంబాల మల్లారెడ్డి, నమిలికొండ శ్రీనివాస్, నర్సింలు, పార్టీ కార్యకర్తలు హైదరాబాద్‌కు తరలివెళ్లారు.


హైదరాబాద్‌లో సకలమ్మకు నివాళి అర్పిస్తున్న మాజీ సీఎం కేసీఆర్

రౌడీషీటర్లపై నిరంతర నిఘా

- శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు
- పాతనేరస్తులపై పర్యవేక్షణ
- జాబ్‌మేళా నిర్వహించి ఉపాధి కల్పిస్తాం
- ఎస్పీ అఖిల్ మహాజన్



సిరిసిల్ల పోలీస్‌స్టేషన్‌లో మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల: రౌడీషీటర్లు, హిస్టరీషీట్లు, సస్పెక్ట్, పాతనేరస్తులపై నిరంతరం పోలీస్ నిఘా ఉంటుందని ఎస్పీ అఖిల్‌మహాజన్ హెచ్చరించారు. సిరిసిల్ల ఠాణాలో శనివారం సబ్ డివిజన్ పరిధిలోని పాతనేరస్తులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ నేరచరితులు విధిగా పోలీసు పిలిస్తే సమయానికి ఠాణాకు హాజరుకావాలని సూచించారు. నిర్లక్ష్యం చేస్తే అరెస్ట్ చేసి బైండోవర్ చేస్తామన్నారు. ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నేరాలకు దూరంగా ఉండటంతోపాటు సత్ప్రవర్తనతో మెదులుతున్న వారిని గుర్తించి షీట్స్ తొలగిస్తామన్నారు. శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భూముల పంచాయితీలు, సెటిల్‌మెంట్లు చేస్తే చట్టపరంగా శిక్షిస్తామన్నారు. సత్ప్రవర్తనతో జీవితాలను సరిదిద్దుకోవాలని, ఉపాధి లేని వారికి జాబ్‌మేళాలతో ఉపాధి చూపిస్తామన్నారు. సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, సీఐలు కృష్ణ, మొగిలి, శ్రీనివాస్‌గౌడ్, ఎస్సైలు రామ్మోహన్, శ్రీకాంత్‌గౌడ్, రమాకాంత్, గణేష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

పద్ధతి మార్చుకోండి

వేములవాడ: గతంలో చేసిన తప్పిదాలను మరచిపోయి పద్ధతులను మార్చుకొని ప్రశాంతంగా జీవించాలని, లేదంటే తామే మారుస్తామని ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. వేములవాడ టౌన్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో శనివారం సబ్ డివిజన్‌లోని రౌడీషీటర్లకు అవగాహన కల్పించారు. గతంలో రౌడీషీటర్లుగా ఉన్న అందరిపై నిఘా ఉందని, ఎవరూ ఎలాంటి తప్పు చేసినా తప్పించుకునే ప్రసక్తే లేదన్నారు. ఇప్పటికైనా పద్ధతి మారకుంటే ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు. చేతులపై రౌడీ అంటూ పచ్చబొట్టు వేసుకున్న వ్యక్తిని స్వయంగా పిలిచి ఘాటుగా హెచ్చరించారు. మారారని తెలిస్తే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు పోలీసుశాఖ సహకరిస్తుందని చెప్పారు. ఈ సమావేశానికి కొందరు రౌడీషీటర్లు గైర్హాజరవడంపై ఎస్పీ సీరియస్ అయ్యారు. గైర్హాజరైన వారు రెండు రోజుల్లో జిల్లా ఎస్పీ కార్యాలయానికి రావాలని ఆదేశించారు. సీఐలు శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, ఎస్సైలు మారుతి, అంజయ్య, రమేశ్, పృథ్వీరాజ్, అశోక్, ప్రశాంత్‌రెడ్డి ఉన్నారు.

రాజన్న సేవలో కలెక్టర్



వేములవాడ: రాజన్నను జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా శనివారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆయనకు ప్రత్యేక దర్శనం అవకాశం కల్పించారు. అనంతరం వేదోక్త ఆశీర్వచనం గావించారు.

ఆకట్టుకున్న మాక్ పోలింగ్


ఇంక్ పెడుతున్న విద్యార్థి అధికారులు

గంభీరావుపేట(సిరిసిల్ల): జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని గంభీరావుపేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం మాక్‌పోలింగ్ నిర్వహించారు. సాధారణ పోలింగ్‌ను తలపించేలా ఎన్నికలు నిర్వహించారు. ఓటరు లిస్టు, గుర్తింపుకార్డులు, ఏజెంట్లు, పోలింగ్‌బాక్స్ ఏర్పాటు చేశారు. విద్యార్థులే ఎన్నికల అధికారులుగా వ్యవహరించగా, మిగతా వారు ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఈ ప్రక్రియతో ఓటింగ్‌పై సంపూర్ణ అవగాహన కలిగిందని హెచ్‌ఎం శ్రీనివాస్ తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వి.విజయలక్ష్మి, ఎస్సై శ్రీకాంత్ మాక్‌పోలింగ్‌ను పరిశీలించి విద్యార్థులను, ఉపాధ్యాయులను అభినందించారు.

కష్టాలకు ఎదురీది.. విజేతగా నిలిచి

- ఏఈ కొలువు కొట్టిన కొండాపూర్ యువకుడు


రఫీని అభినందిస్తున్న గ్రామస్తులు

ముస్తాబాద్(సిరిసిల్ల): కష్టాలు వెంటాడిన మొక్కవోని ధైర్యంతో నిలబడ్డాడు. పరీక్షలకు ఇంటి వద్దే ప్రిపేర్ అయి ప్రభుత్వ కొలువుకొట్టి శభాష్ అనిపించుకున్నాడు ముస్తాబాద్ మండలం కొండాపూర్‌కు చెందిన రఫీ. ప్రభుత్వం ప్రకటించిన ఫలితాల్లో ఆర్‌అండ్‌బీ ఏఈగా ఎంపికయ్యాడు. గ్రామానికి చెందిన బహదూర్, అఫ్రిన్‌లకు ముగ్గురు కుమారులు అబూ, రఫీ, ఖలీద్. పెద్ద కొడుకు అబూ కూలీగా పనిచేస్తూ రెండేళ్ల క్రితం ట్రాక్టర్ ప్రమాదంలో మృతిచెందాడు. తండ్రి బహదూర్ పెరాలసిస్‌తో బాధపడుతూ ఏడాది క్రితం చనిపోయాడు. తల్లి అఫ్రిన్ బీడీలు చుడుతూ ఇద్దరు పిల్లలను చదివించింది. కొండాపూర్ జెడ్పీ పాఠశాలలో పదోతరగతి చదివిన రఫీ.. ఇంటర్, బీటెక్ పూర్తి చేశాడు. ఎలాంటి కోచింగ్ లేకుండా ఇంటి వద్దే పరీక్షలకు ప్రిపేర్ అయిన రఫీ ఆర్‌అండ్‌బీలో ఏఈగా ఎంపికయ్యాడు. రఫీని మాజీ సర్పంచ్ యారాటి లక్ష్మి, ప్యాక్స్ మాజీ వైస్‌చైర్మన్ బొందుగుల దేవిరెడ్డి, కరుణాకర్ తదితరులు అభినందించారు.

వాలీబాల్ పోటీలు ప్రారంభం

బోయినపల్లి(చొప్పదండి): ఉమ్మడి జిల్లా వాలీబాల్ పోటీలను స్పోర్ట్స్‌క్లబ్ ఆధ్వర్యంలో శనివారం బోయినపల్లి మండలం కొదురుపాక హైస్కూల్‌లో ప్రారంభించారు. సుమారు 40 జట్లు పాల్గొంటున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఎంపీడీవో జయశీల, ఎస్సై పృథ్వీధర్‌గౌడ్, సింగిల్‌విండో చైర్మన్ జోగినిపల్లి వెంకట్రామారావు, జిల్లా వాలీబాల్ అసోసియేషన గౌరవ అధ్యక్షుడు కూస రవీందర్, బొలుమాల శంకర్, స్పోర్ట్స్‌క్లబ్ అధ్యక్షుడు ర్యాకం రాజేశ్, నాగుల వంశీ, ముంజె సతీశ్, వన్నెల రమణారెడ్డి, వెంకటేశ్ తదితరులు ఉన్నారు.